

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

హైకోర్టు తీర్పు నేపథ్యాన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు త్వరలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. 8లో



మోదీ ఓడితేనే సాగుకు బతుకు

రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీని ఓడిస్తేనే అన్నదాతలకు మేలు జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్ననికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యాన శుక్రవారం హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు జిల్లా ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కాగా, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశంపై హైకోర్టు స్టే తలగించిన నేపథ్యాన వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు.

బీసీ విదేశీ విద్యానిధికి దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం కింద 2023 సెప్టెంబర్(ఫాల్ సీజన్) కాలానికి గాను బీసీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు సీటు సాధించినా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేయనున్నారు. 2023 జులై 1 నాటికి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించని వారు అర్హులని అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్‌సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాల్లో 60 శాతం మార్కులు సాధించి, విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశానికి లేఖ ఉన్న వారు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జి.జ్యోతి సూచించారు.

సమర్థవంతంగా ఉచిత న్యాయసేవలు

ఖమ్మంలీగల్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా నియమితులైన న్యాయవాదులు ఉచిత న్యాయసేవలను సమర్థవంతంగా అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలో గురువారం జరిగిన సమావేశంలో ఇప్పటివరకు అప్పగించిన క్రిమినల్ కేసుల వివరాలు ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయసేవలు అందించడంతోపాటు కక్షిదారులతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అలాగే, ఈనెల 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుతం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనుండడంతో రాష్ట్రంలో ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ డీఎస్సీ ద్వారానే భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(టీఎస్‌పీటీఏ), ఎస్టీఎఫ్ టీఎస్ రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, సయ్యద్ షౌకత్ అలీ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ఎస్టీఎఫ్ టీఎస్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశంపై సంఘాలతో చర్చించాకే షెడ్యూల్ విడుదల చేయాలని సూచించారు. లేనిపక్షంలో సమస్యలు వస్తాయని తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం హైదరాబాద్‌లో యూఎస్‌పీసీ ఆధ్వర్యాన జరిగే మహాధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు జి.యాదగిరి, షేక్ మన్సూర్, షేక్ హసన్, మహ్మద్ హుస్సేన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకే ఖరారు...!



తుమ్మల నాగేశ్వరరావుతో ఆయన నివాసంలో రేవంత్‌రెడ్డి, తుమ్మల తనయుడు యుగంధర్, నాయకుడు సాధు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సుదర్శన్‌రెడ్డి, మల్లు రవి తదితరులు

అనుచరులతో హస్తం గూటికి చేరనున్న తుమ్మల

- మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- పార్టీలోకి రావాలని ఆహ్వానం..
- పాలేరు నుంచే పోటీకి గ్రీన్‌సిగ్నల్?

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హస్తం గూటికి చేరడం దాదాపు ఖరారైంది. అనుచర నేతలు, కేడర్‌తో వారం రోజులుగా చేసిన మంతనాలతో ఆయన కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, సుదర్శన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని తుమ్మల ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని నాగేశ్వరరావు సన్మానించగా.. ఆయన సైతం శాలువా కప్పి కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. ఆతర్వాత కాసేపు భేటీ అయ్యారు. ఈమేరకు 10వ తేదీలోగా ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న తన అనుచరులతో కలిసి తుమ్మల కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ నిరాకరించడంతో మెజారిటీ అనుచరుల నిర్ణయానికి తలొగ్గిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానం

నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిరుగులేని నేతగా చెలామణి అయ్యారు. ఉద్దండులైన నేతలను రాజకీయంగా ఎదుర్కొన్నారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, లక్కినేని జోగారావు వంటి నేతలపై పోటీ చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి 1983లో ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి లక్కినేని జోగారావుపై విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. 1989లో ఓటమి చవిచూశారు. 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు జలగం ప్రసాదరావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డిపై విజయం సాధించారు. వరుసగా చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో తొమ్మిదేళ్లు మంత్రిగా పనిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లికి గుర్తింపు తెచ్చారు. ఆతర్వాత 2004లో జలగం వెంకటరావుపై ఓడిపోయారు. ఇక 2009లో సత్తుపల్లి ఎస్సీకి రిజర్వ్ కావటంతో ఖమ్మం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన జలగం వెంకటరావుపై స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. అలాగే, 2014లో కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఆయన ఇక్కడినుంచే 2018 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు.

టికెట్ ఆశించి.. భంగపడి

గత ఎన్నికల్లో పాలేరు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన తుమ్మల అనూహ్యంగా ఓటమి చవిచూశారు. అయితే, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కందాల ఉపేందర్‌రెడ్డి అనంతర పరిణామాల్లో బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో రెండు వర్గాలు ఏర్పడగా విబేధాలు పొడచూపాయి. అయినప్పటికీ పాలేరు టికెట్ తనకేనన్న ధీమాతో తుమ్మల ఉండగా.. కందాల ఉపేందర్‌రెడ్డినే కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఓ సమయాన రాజకీయాల నుంచి నిష్క్రమించాలని భావించినా... అనుచరులు, అభిమానుల ఒత్తిడి మేరకు పోటీ చేస్తానంటూ ప్రకటించారు.

గండుగులపల్లిలో సమాలోచనలు

ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించాక గత నెల 25న మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు, అనుచరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభిమానుల కోరిక మేరకు పోటీలో ఉంటానని పేర్కొన్నా ఏ పార్టీలో చేరేది వెల్లడించలేదు. ఆ తర్వాత స్వగ్రామమైన గండుగులపల్లి వెళ్లి అనుచరులు, అభిమానులతో వారం రోజుల పాటు మంతనాలు కొనసాగించారు. కాంగ్రెస్‌లోకే వెళ్లాలని కొందరు ఘంటాపథంగా చెప్పగా.. మరికొందరు ఏ నిర్ణయం తీసుకున్నా వెంట నడుస్తామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాపై ఎంత ప్రభావం

కాంగ్రెస్‌లో తుమ్మల చేరనుండటంతో ఉమ్మడి జిల్లాలో ఆయన ప్రభావం ఎంత మేరకు ఉంటుందనే చర్చ మొదలైంది. తుమ్మల ఉమ్మడి జిల్లానే కాకుండా రాజధాని చుట్టుపక్కల తన సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రభావం చూపుతారని చెబుతున్నారు. ఆయన చేరికను ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ కాంగ్రెస్ నేతలు కూడా స్వాగతించినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో రెండు పార్టీల్లో ఒక వెలుగు వెలిగిన తుమ్మల.. కాంగ్రెస్‌లో చేరితే ఏ మేరకు ప్రభావం చూపగలరన్న అంశం ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

పాలేరు నుంచే పోటీ?

తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమే కావడంతో పాలేరు నుంచి పోటీ కూడా ఖరారైనట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ తనకు టికెట్ నిరాకరించినా.. కాంగ్రెస్ అభ్యర్థిగా పాలేరు నుంచే పోటీ చేసి గెలిచి సత్తా చాటాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులుగా జరిగిన చర్చల్లోనూ ఆయన అనుచరులు ఇదే అంశంపై విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలతో చర్చల సందర్భంగానూ ఆయన తనకు పాలేరు టికెట్ ఇస్తేనే చేరతానని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ షరతుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే రేవంత్‌రెడ్డి కలిశారని సమాచారం.

ఈనెల 10లోగా ముహూర్తం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆపార్టీ నేతలు.. మాజీ మంత్రి తుమ్మల, ఆయన తనయుడు యుగంధర్, అనుచర నేత సాధు రమేష్‌రెడ్డి మరి కొందరిని కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు తుమ్మలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించగా.. అనుచరులతో మాట్లాడి చెబుతానని తుమ్మల అన్నట్లు సమాచారం. అయితే, తుమ్మల కాంగ్రెస్‌లో చేరేందుకు సానుకూలంగా ఉన్నందునే రేవంత్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లారని తెలుస్తోంది. త్వరలోనే నాగేశ్వరరావు తన అనుచర గణంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్‌లో చేరనుండగా... ఉమ్మడి ఖమ్మంతో పాటు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పలు నియోజకవర్గాల్లోని అనుచరులు కూడా అదే రోజు కాంగ్రెస్‌లో చేరేలా కసరత్తు చేస్తున్నారు. ఈనెల 10లోగా మంచిరోజు చూసుకుని పార్టీలో చేరికకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు సమాచారం.

రెడీ... 1,2,3!



9 ఫీట్ల జంప్ చేసే రన్ వే



జెడ్ క్రాస్ బార్

- 'అగ్నివీర్' ర్యాలీకి సర్వం సిద్ధం
- నేటి నుంచి అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్‌లు
- సర్దార్ పటేల్ స్టేడియంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- అర్ధరాత్రి 12.30 గంటల నుంచే పోటీల ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా హాజరుకానున్న 7వేల మందికి పైగా అభ్యర్థులు

ఖమ్మం స్పోర్ట్స్: సైన్యంలో నియామకాలకు సంబంధించి అగ్నివీర్ ర్యాలీ శుక్రవారం నుంచి జిల్లా కేంద్రంలో జరగనుంది. ఇందుకోసం సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఫిజికల్ టెస్ట్‌ల నిర్వహణ కోసం ఏడుగురు నోడల్ ఆఫీసర్లను నియమించారు. స్టేడియంలో ట్రాక్ చుట్టు బారికేడ్లు ఏర్పాటు చేసి ఇతరులు లోపలకు రాకుండా ఆంక్షలు విధించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన ఏడు వేల మందికి పైగా అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్‌కు హాజరుకానున్నారు. రోజుకు 1,200 మంది చొప్పున హాజరయ్యేలా అధికారులు అడ్మిట్ కార్డులు జారీచేశారు.

బయోమెట్రిక్‌తో మొదలు..

నిర్ణీత తేదీల్లో అభ్యర్థులు వచ్చేలా అధికారులు అడ్మిట్ కార్డులు జారీ చేశారు. అభ్యర్థుల వివరాలను తొలుత బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తారు. అనంతరం ఎత్తు, బరువు పరీక్షించాక 1,600 మీటర్ల పరుగు, 9 ఫీట్ల జంప్, జెడ్ ఆకారం మాదిరి క్రాస్‌బార్‌పై నడిచే పోటీ నిర్వహిస్తారు. మొదటగా వంద మంది చొప్పున 1,600 మీటర్ల పరుగుకు అనుమతిస్తారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని నిర్దేశిత బాక్సుల్లోకి పంపిస్తారు. ఆతర్వాత 9 ఫీట్ల జంప్, పుష్ అప్స్, జెడ్ క్రాస్ బార్‌పై నడిచే పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లు ముగిసిన మరుసటి రోజు ఫిజికల్ టెస్ట్ ఉంటుంది. కాగా, ప్రతీ ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు బిగించగా... పర్యవేక్షణ కోసం పెద్ద టీవీ ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆర్మీ అధికారులు స్టేడియంలోకి ఇతరులను అనుమతించడంలేదు. ముందుగా అభ్యర్థులు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలోకి వచ్చి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయించుకున్న తర్వాతే స్టేడియంలోకి అనుమతిస్తారు. ఎక్కడ కూడా తోపులాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు అర్ధరాత్రి రాత్రి 12.30 గంటలకు ప్రారంభమయ్యే పోటీలు ఉదయం 8 గంటల్లోగా ముగించనున్నారు. జిల్లా పోలీసులతో పాటు ఆర్మీ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఇతరులకు అనుమతి లేదు.. ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, కల్నల్ దాస్ తదితరులు

స్టేడియంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఆర్మీ కల్నల్ కీట్స్ దాస్, పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి పరిశీలించారు. ర్యాలీ పూర్తయ్యే 8వ తేదీ వరకు సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానాల్లోకి వాకర్లు, క్రీడాకారులకు అనుమతి నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చేవారి కోసం రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. దూర ప్రాంతాల అభ్యర్థులకు వసతి కూడా కల్పిస్తామని తెలిపారు. ఇందుకోసం అంబేద్కర్ భవన్ సూపరింటెండెంట్ హన్మంతరావు(98496 89815), గిరిజన భవన్ అధికారి తిరుమలరావు(93464 49958), టీటీడీసీ అధికారి గోపీలాల్(92911 48255)ను సంప్రదించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ బి.మాలతి, అగ్నిమాపక శాఖ అధికారి సూర్యప్రకాష్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో తరగతులు వాయిదా

పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యాకే బోధన



అనాటమీ విభాగంలో సిద్ధమైన సామగ్రి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శుక్రవారం నుంచి ఇంట్రడక్షన్ తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే, ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు రాకపోవటంతో వాయిదా వేశారు. మెడికల్ కళాశాల ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరగా, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. నీట్ ర్యాంకర్లకు తొలి విడత కౌన్సెలింగ్ పూర్తికాగా, జాతీయ, రాష్ట్ర స్థాయి కోటాలో కలిపి 90 మంది చేరారు. మరికొన్ని కౌన్సెలింగ్‌లు పూర్తయ్యాక కేటాయించిన వంద సీట్లు భర్తీ కానున్నాయి. దీంతో శుక్రవారం నుండి 11వ తేదీ వరకు నిర్వహించాలని భావించిన ఇంట్రడక్షన్ తరగతులను వాయిదా వేశారు. కాగా, భవనాల ఆధునికీకరణ పనులతో పాటు మౌలిక సదుపాయాల కల్పన చకచకా సాగుతోంది. పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో బాలికలు, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాలుర హాస్టళ్లు సిద్ధం కాగా, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చివరి దశకు చేరింది. ఇక మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రిని అనుసంధానిస్తూ రూ.3.25 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



మధిర స్టేడియంలో పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

మధిర: మధిర నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేలా వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి, ఇండోర్ స్టేడియం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులతో పాటు మడుపల్లిలో డంపింగ్ యార్డుకు అనుసంధానంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఇండోర్ స్టేడియం పనుల్లో జాప్యంపై ఆరా తీసిన ఆయన ఈనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అలాగే, యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, అంబేద్కర్ ఆడిటోరియం, పాత డంపింగ్ యార్డును కూడా పరిశీలించాక మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలెక్టర్ భోజనం చేయగా, వారు రాఖీలు కట్టారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, మున్సిపల్ చైర్మన్ మొండితోక లత, వైస్ చైర్మన్ శీలం విద్యాలత, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, పీఆర్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2, 3వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్

ఖమ్మం సహకారనగర్: కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పుల కోసం ఈనెల 2, 3వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఉండే సిబ్బంది వద్ద జాబితా పరిశీలించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ సేకరించాలి

మిల్లర్ల నుంచి పూర్తిస్థాయి సీఎంఆర్ సేకరించాలని సివిల్ సప్లయీస్ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీసీ ద్వారా పలు సూచనలు చేశారు. వీసీలో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ డి.మధుసూదన్, డీఎం శ్రీలత, ఏఎంటీ నర్సింహారావు పాల్గొన్నారు.

గ్రామదీపికలకు మరింత 'గౌరవం'

- రూ.5వేలకు పెరిగిన వేతనం
- జిల్లాలో 960 మందికి లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్లుగా వేతనాల పెంపు కోసం ఎదురు చూస్తున్న గ్రామదీపికలకు రాష్ట్రప్రభుత్వం తీపి కబురు చెప్పింది. స్వయం సహాయక సంఘాల నిర్వహణలో గ్రామ స్థాయిలో కీలక భూమిక పోషిస్తున్న వీఓఏ (గ్రామ సమైక్య సహాయకులు)ల గౌరవ వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు నిరవధిక దీక్ష చేపట్టారు. గ్రామదీపికలకు న్యాయం చేస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించగా, తాజాగా గ్రామదీపికల వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సంఘాల నిర్వహణలో కీలకం

జిల్లాలో 960 మంది గ్రామదీపికలు వీఓఏలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇప్పించడం, సంఘాల నిర్వహణ సక్రమంగా సాగేలా చూడడం, రికార్డులు రాయించడం, రుణాల రికవరీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు రూ.3,900 ఉన్న వేతనాన్ని రూ.5 వేలకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేతనానికి అదనంగా సంఘాల తరఫున ప్రోత్సాహక నగదు రూ.3వేల వరకు అందనుంది. మొత్తంగా రూ.8వేల మేర వేతనం అందుతుందని చెబుతున్నారు. కాగా, రక్షాబంధన్ కానుకగా రాష్ట్రంలోని మహిళా సంఘాల సహాయకు(వీఓఏ)ల వేతనాలను పెంచడం హర్షణీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు



హాస్టల్ విద్యార్థులతో భోజనం చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్

చింతకాని: పౌరుల హక్కులకు ఎవరు కూడా భంగం కలిగించొద్దని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ సూచించారు. మండలంలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పౌర హక్కులపై ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఆతర్వాత ఎస్సీలతో కలిసి గ్రామంలోని శ్రీ కోదండరామాలయానికి వెళ్లిన ఆయన, గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆలస్యం నాగమణి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లోకి మాదిగ హక్కుల దండోరా నాయకులు



శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ సహా 200మంది గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరావు, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో భేటీ



జ్ఞానేశ్వర్‌తో చర్చిస్తున్న రామనాథం

ఖమ్మంఅర్బన్: టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను హైదరాబాద్‌లో గురువారం ఖమ్మం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిస్థితులపై నివేదిక సమర్పించాక వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకు ఆమోదం

న్యాయవాద సహకార సంఘ జనరల్ బాడీలో కీలక నిర్ణయాలు..

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయవాద సహకార సంఘం సభ్యుల ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాన్ని బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీకి సంబంధించిన బైలాలో సవరణలు, నూతన సభ్యులకు సభ్యత్వం విషయంపై కొన్ని సవరణలకు అమోదం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొంది లేదా పింఛన్ పొందుతున్న వారు, వేర్వేరు వృత్తుల్లో ఉండి న్యాయవాదులుగా ఉన్న వారిని సొసైటీ సభ్యత్వానికి అనర్హులుగా నిర్ణయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ మాట్లాడగా, సొసైటీ కార్యదర్శి రమేష్‌బాబుతో పాటు హేమంత్, బిచ్చాల తిరుమలరావు, కర్లపుడి శ్రీనివాసరావు, శేఖర్ రాజు, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న గుడిలో ప్రతీ పౌర్ణమికి సుదర్శన హోమం




ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతీనెల పౌర్ణమి రోజున సుదర్శన హోమం నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా ఆలయాల్లో ప్రత్యేక సందర్భాలు, ఉత్సవాలు, పండుగ రోజుల్లోనే అర్చకులు హోమం నిర్వహిస్తారు. అయితే, పౌర్ణమి రోజున సుదర్శన హోమం నిర్వహిస్తే మంచిదననే నమ్మకంతో భక్తులు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యాన ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈ అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు ఎస్బీ.రఘునాథాచార్యుల బృందం సుదర్శన హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలు

ఖమ్మంక్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. నగరంలో ఇటీవల చేపట్టిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 11మందిని మున్సిఫ్ మెజిస్ట్రేట్ శాంతిలత ఎదుట గురువారం హాజరుపర్చామని చెప్పారు. వీరిలో ఇద్దరికి రెండేసి రోజులు, ఇంకో ఇద్దరి మూడేసి రోజుల జైలు శిక్షతో పాటు మిగతా ఏడుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. అలాగే, జైలుశిక్ష పడిన వ్యక్తుల లైసెన్స్ రద్దు చేయాలని ఆర్‌టీఓ కార్యాలయానికి సిఫారసు చేసినట్లు ఏసీపీ వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- తొలగిపోయిన అడ్డంకులు
- ఉపాధ్యాయుల్లో చిగురిస్తున్న ఆశలు
- షెడ్యూల్ త్వరగా విడుదల చేయాలని డిమాండ్



గతంలో బదిలీల సందర్భంగా పాత డీఈఓ కార్యాలయం వద్ద సందడి (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: బదిలీలు, పదోన్నతులు అనగానే సీనియారిటీ ఆధారంగా వస్తుందనే నమ్మకం ప్రతీ ఉద్యోగికి ఉంటుంది. కానీ ఉపాధ్యాయుల విషయానికొచ్చే సరికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. సుమారు ఎనిమిదేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవటంతో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ ఏడాది జనవరిలో షెడ్యూల్ విడుదల చేశారు. అయితే, వివిధ కారణాలతో ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో బ్రేక్ పడింది. తాజాగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎందుకు అడ్డంకులు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం ఈ ఏడాది జనవరి 25న జీఓ విడుదల చేసింది. అయితే, 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులు కొందరు హైకోర్టును ఆశ్రయించగా వారు దరఖాస్తు చేసుకుంటూ, పూర్వపు స్థానానికి పాయింట్లు వర్తింపచేయాలని ఫిబ్రవరి 7వ తేదీన మరో జీఓ ఇచ్చారు. కానీ కొందరు స్పౌజ్‌లకు పాయింట్లు ఇవ్వడానికి వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు. ఈమేరకు ఫిబ్రవరిలో స్టే విధించింది. ఏడు నెలలుగా కేసు వాయిదా పడుతుండగా.. ఆగస్టు 30న స్టే వెకెట్ చేసిన కోర్టు బదిలీల నిర్వహణకు అనుమతించింది.

ప్రస్తుతం ఇలా..

ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులకు ఇచ్చే పది పాయింట్లు తొలగించి, స్పౌజ్ ఉపాధ్యాయుల పాయింట్లు పెంచినట్లు చెబుతున్నారు. అయితే, ప్రభుత్వం వెంటనే బదిలీల షెడ్యూల్ జారీ చేసి నెల రోజుల్లోగా బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తద్వారా విద్యారంగంలో సంక్షోభం తొలగిపోతుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే అనేక హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్ పోస్టులు భర్తీ కావటంతో పాటు పర్యవేక్షణ అధికారులు వస్తారనే భావన వ్యక్తమవుతోంది.

జిల్లాలో హెచ్‌ఎంలు, ఎస్‌ఏల భర్తీకి అవకాశం

పదోన్నతుల్లో భాగంగా జిల్లాలో 90 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సుమారు 400 వరకు స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో 1,047 ఖాళీలు ఉన్నాయి. పదోన్నతులు ద్వారా సుమారు 500 పోస్టులు నిండుతాయి. అలాగే, సుమారు 700 ఎస్‌జీటీ పోస్టులు, 300 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. కాగా, గతంలో బదిలీల కోసం సుమారు 2 వేలు, పదోన్నతుల కోసం సుమారు 450 వరకు దరఖాస్తులు వచ్చాయి.

సమయం తక్కువ

హైకోర్టు సూచనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు తక్షణమే చేపట్టాల్సి ఉంది. ఒకవేళ ఆలస్యం జరిగి, ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వస్తే మళ్లీ ఇబ్బంది ఎదురవుతోంది. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక అర్హులు నష్టపోతుండగా, బదిలీలు జరగక ఒకే ప్రాంతంలో 12, 13 ఏళ్ల నుంచి విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల్లో నిరాసక్తత ఏర్పడింది. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ పోస్టులు భర్తీ కావాలంటే 70శాతం పదోన్నతుల ద్వారా సాధ్యమవుతుంది. ఇప్పటికే విద్యాసంవత్సరం మూడు నెలల గడిచినందున బోధనకు ఇబ్బంది లేకుండా వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. అలాగే, 317 జీఓ ద్వారా నష్టపోయిన భార్యాభర్తలను ఒకే జిల్లాకు తీసుకు రావాల్సిన అవసరం ఉందని, బదిలీల అనంతరం వారికి కూడా అవకాశం ఇవ్వాలని విన్నవిస్తున్నారు.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయమై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. గుర్తింపు సంఘాల బాధ్యులకు పాయింట్లను తాత్కాలికంగా తొలగించాలనే ఆదేశాన్ని గౌరవిస్తాం. ఇకనైనా ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ ప్రకటించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి. – పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, టీఎస్ యూటీఎఫ్

తక్షణమే షెడ్యూల్ విడుదల చేయాలి



ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి చిత్తశుద్ధితో ప్రక్రియ చేపట్టాలి. అక్రమాలకు తావులేకుండా ప్రక్రియ పూర్తిచేయాలి. రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని దరఖాస్తుకు అనుమతించాలి. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు, స్పౌజ్ బాధితులకు న్యాయం చేయాలి. – ఎస్.విజయ్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఖమ్మం

వివరాలు సేకరిస్తున్నాం



ఎప్పుడు నిర్ణయం వచ్చినా జిల్లాలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టేలా సిద్ధమవుతున్నాం. ఇప్పటికే ఎంఈఓల నుంచి పూర్తి వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యాం. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన వెంటనే నిబంధనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు చేపడుతాం. – సోమశేఖరశర్మ, డీఈఓ

● సీపీని కలిసిన ఏసీపీలు



సీపీకి పూలమొక్కలు అందజేస్తున్న ఏసీపీలు

ఇటీవల ఏసీపీలుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు గురువారం సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను కలిశారు. ఖమ్మం టౌన్, స్పెషల్ బ్రాంచ్, సిటీ క్రైమ్ రికార్డు బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏసీపీలు ఎస్.వీ.హరికృష్ణ, పీ.వీ.గణేష్, ప్రసన్నకుమార్, కె.శంకరయ్య సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. – ఖమ్మంక్రైం

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ గెలుపే ముఖ్యం

పాలేరు నియోజకవర్గ నేతలతో పొంగులేటి



పాలేరు నాయకులతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పాలేరులో అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ గెలుపే ముఖ్యమని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అయితే, పాలేరు నుంచి పోటీచేయాల్సిందిగా వారు కోరడంతో అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ గెలుపే ముఖ్యంగా భావించాలని తెలిపారు. గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పాత, కొత్త తేడా లేకుండా అంతా ఐకమత్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హరినాథబాబు, కళ్లెం వెంకటరెడ్డి, గోనె భుజంగరెడ్డి, మద్ది కిశోర్‌రెడ్డి, అజ్మీరా అశోక్‌నాయక్, బోడా వెంకన్న, సుదగాని ఉపేందర్, తిప్పిరెడ్డి రాజశేఖరరెడ్డి, నాగండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తాం



మేకల మల్లిబాబును పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి, కనకయ్య

కామేపల్లి(కారేపల్లి): అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, తమ పార్టీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కామేపల్లి మండలం పండితాపురంలో జరిగిన గొడవల్లో భాగంగా జైలుకు వెళ్లి ఇటీవల విడుదలైన డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌ను ఆయన గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం ఇకనైనా ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, నాయకులు తుల్లూరి బ్రహ్మయ్య, గుమ్మా రోశయ్య, కోట రాంబాబు, బానోతు నరసింహానాయక్, చల్లా మల్లయ్య, ధరావత్ లాలునాయక్, మేకల మల్లికార్జునరావు, అంబడిపూడి రంగయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● రాఖీ కట్టేందుకు అమెరికా నుంచి వచ్చిన సోదరి



వాణీశంకర్‌తో సోదరులు, కుటుంబీకులు

ఖమ్మంగాంధీచౌక్: అమెరికాలో ఉంటున్న మహిళ తన నలుగురు సోదరులకు రాఖీ కట్టేందుకు ఖమ్మం వచ్చారు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన అర్గుల వాణీశంకర్ రాఖీ పండుగ సందర్భంగా ఖమ్మం వచ్చి సోదరులు కడవెండి రాంబాబు, శ్రీనివాస్, విశ్వనాథ్, డాక్టర్ వేణుగోపాల్‌కు రాఖీ కట్టారు. ఈసందర్భంగా కుటుంబీకులంతా ఒక చోటకు చేరి సంతోషం పంచుకున్నారు.

● కులమతాలకతీతంగా రాఖీ

రాఖీ వేడుకలను కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. హిందువులతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా సోదరీమణులతో రాఖీలు కట్టించుకున్నారు. ఖమ్మంలోని శ్రీనివాస్‌నగర్ బెస్తకాలనీలో నివాసముంటున్న మార్కెట్ కమిటీ ఉద్యోగి వజీరుద్దీన్ తన చెల్లెలితో రాఖీ కట్టించుకుని అనుబంధానికి కులమత బేధం లేదని నిరూపించారు.



వజీరుద్దీన్‌కు రాఖీ కడుతున్న ఆయన చెల్లెలు

● శునకానికి రాఖీ కట్టిన చిన్నారి



శునకానికి రాఖీ కడుతున్న చిన్నారి

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో నివాసముండే ఓ కుటుంబం రెండేళ్ల నుంచి ఓ శునకాన్ని పెంచుకుంటున్నారు. తమ సొంత బిడ్డ లాగే దాన్ని చూసుకుంటున్నారు. ఈ సందర్భంగా కుటుంబంలోని చిన్నారి గురువారం ఆ శునకానికి రాఖీ కట్టి సంతోషం పంచుకున్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న సంధ్యారెడ్డి, దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సందర్భంగా ఇచ్చే ప్రతీ హామీని తూచా తప్పకుండా అమలుచేసేది కాంగ్రెస్ మాత్రమేనని కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జా సంధ్యారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలోకి కూడా అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, గృహలక్ష్మి ద్వారా రూ.5లక్షల సాయం తదితర హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు దొబ్బల సౌజన్య, సైదులు, వెంకటేశ్వర్లు, రవికుమార్, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో రక్షాబంధన్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనేందుకు స్వగ్రామానికి వెళ్లిన ఓ అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను మావోయిస్టులు కిడ్నాప్ చేసి, దారుణంగా హతమార్చారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తోయ్నార్ క్యాంపులో అసిస్టెంట్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బుద్రం అవలం (33) మూడు రోజుల క్రితం స్వగ్రామం జంగాకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై అతని మేనల్లుడిని గంగులూరు సమీపంలోని దుపాలిపారాలో దింపి వస్తుండగా గ్రామ శివారులో ఆపి బుద్రం అవలంను కిడ్నాప్ చేశారు. గురువారం ఉదయం కత్తులు, గొడ్డళ్లతో దారుణంగా హతమార్చి మృతదేహాన్ని దుపాలిపారా శివారులోని రహదారిపై పడేశారు. స్థానికులు గుర్తించి గంగులూరు పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గంగులూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనపై జిల్లా ఎస్పీ అంజనేయవర్షణే మాట్లాడుతూ మావోయిస్టులు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కింది స్థాయి ఉద్యోగి సెలవుపై వెళ్లిన సమయంలో నిరాయుధుడిని చేసి హతమార్చడం సరైంది కాదన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు మావోయిస్టులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని, ఎవరూ భయపడవద్దని ఎస్పీ సూచించారు.

మోదీ ఓడితేనే సాగుకు బతుకు

- రైతుల విషయంలో కేసీఆర్, మోదీ ఇద్దరూ ఒకటే
- ఎస్‌కేఎస్‌ఎం సదస్సులో రైతు సంఘాల నేతలు




సదస్సులో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో వ్యవసాయరంగం బతకాలంటే మోదీ గద్దెదిగాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ అన్నారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) సదస్సు కొండపర్తి గోవిందరావు, బొంతు రాంబాబు, ఆవుల వెంకటేశ్వర్లు, ఎం.గిరి అధ్యక్ష వర్గంగా జరిగింది. ఈసమావేశంలో హేమంతరావు, సుదర్శన్‌రావు, చంద్రశేఖర్ మాట్లాడుతూ మోదీ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొడ్డిదారిన రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో రైతు బంధు పేరుతో దగా చేస్తుండగా, మోదీ సైతం అదే బాటలో ఉన్నాడని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ఆదుకునేందుకు ఎటువంటి బీమా సౌకర్యం లేదని ఆరోపించారు. ఇకనైనా పాలకులు తీరు మార్చుకోకపోతే ఢిల్లీ తరహా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కాగా, 2021 అక్టోబర్ 3న రైతులు, జర్నలిస్టుల హత్యకు కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను తొలగించాలనే డిమాండ్‌తో అక్టోబర్ 3న ఆందోళనలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అలాగే, నవంబర్ 23, 24, 25వ తేదీల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సదస్సులో నాయకులు వి.కోటేశ్వరరావు, ప్రకాశ్, దొండపాటి రమేష్, పోటు ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం ?

- గ్రామస్తులతో ఘర్షణకు దిగుతున్నాడని బంధించి దాడి
- తీవ్రగాయాలతో మృతి



వెంకట్రామయ్య (ఫైల్)

పెనుబల్లి: గ్రామస్తులతో తరచుగా ఘర్షణ పెట్టుకుంటుండడంతో ఇదేమిటని ప్రశ్నిస్తూ తమ్ముడు దాడి చేయగా తీవ్ర గాయాలతో అన్న మృతి చెందినట్లు తెలిసింది. మండలంలోని లింగగూడెంలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలను స్థానికులు, పోలీసులు ఇలా తెలిపారు. గ్రామానికి చెందిన కర్రి వెంకట్రామయ్య అలియాస్ రాంబాబు(40) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ గ్రామంలో పలువురితో ఘర్షణకు దిగుతున్నాడు. ఈ క్రమంలోనే గురువారం కూడా మిరియాల వెంకటేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. ఈ నేపథ్యాన గ్రామస్తులపై ఎందుకు దాడి చేస్తున్నావని వెంకట్రామయ్యను తమ్ముడు నరసింహారావు, కుటుంబ సభ్యులు మందలించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే వెంకట్రామయ్య కుటుంబ సభ్యులపైనే కాక నచ్చచెప్పడానికి వచ్చిన వారిపైనా దాడికి పాల్పడ్డాడు. దీంతో వెంకట్రామయ్యను తాళ్లతో బంధించిన తమ్ముడు నరసింహారావు, మరికొందరు కర్రతో కొట్టడంతో తల, ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ సమాచారం అందుకున్న కల్లూరు ఏసీపీ బి.రామానుజం, సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్.హనూక్, వీఎం బంజర్ ఎస్సై జి.సూరజ్ రాత్రి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం వెంకట్రామయ్య మృతదేహాన్ని పెనుబల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, వెంకట్రామయ్యపై తమ్ముడితో పాటు నచ్చచెప్పడానికి వచ్చిన గ్రామస్తుల్లో కొందరు దాడికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్‌ను వివరణ కోరగా కేసు విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఇన్‌ఫార్మర్ హత్య?

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మినప సమీపంలో ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని గురువారం సాయంత్రం నక్సలైట్లు హతమార్చినట్లు సమాచారం. మృతదేహం వద్ద కరపత్రాలు వదిలారు. సాయంత్రం కావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లలేకపోయారు. శుక్రవారం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని గుర్తించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఘటనను అధికారికంగా ధ్రువీకరించలేదు.

మిషన్ భగీరథ గొయ్యిలో పడిన కారు



గుంతలో పడిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కృషి బైపాస్ రోడ్డులో మిషన్ భగీరథ పనుల కోసం తవ్విన గొయ్యిలో గురువారం ప్రమాదవశాత్తు ఓ కారు పడటంతో, అందులో ప్రయాణిస్తున్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారం క్రితం బైపాస్‌రోడ్డులో మూలమలుపు వద్ద తవ్విని గొయ్యిని అసంపూర్తిగా పూడ్చి వదిలేశారు. అక్కడ హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో వేంసూరు రోడ్డు నుంచి వస్తున్న కారు పడింది. ఆ సమయాన కారులో భార్యాభర్తలు, చంటి పాప ఉండగా.. గమనించిన స్థానికులు కారును బయటికి తీయగా ఊపిరి పీల్చుకున్నారు.

పెట్రోలు బంక్‌లో నిలిపిన ట్రాక్టర్ చోరీ

డీజిల్ అయిపోయాక వదిలేసిన దుండగులు



నాగరాజుకు ట్రాక్టర్‌ను అప్పగిస్తున్న పోలీసులు

బోనకల్: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో నిలిపిన ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన తేరాల నాగరాజు బోనకల్‌లో బుధవారం మట్టి తోలకాలు జరిపి బంక్‌లో ట్రాక్టర్ పెట్టి ఇంటికి వెళ్లాడు. గురువారం వచ్చేసరికి ట్రాక్టర్ లేదు. దీంతో గాలిస్తుండగా ముష్టికుంట్ల గ్రామ సమీపాన ఉన్నట్లు తెలిసింది. ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవడంతో దుండగులు వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు చేరుకుని వివరాలు సేకరించాక నాగరాజుకు ట్రాక్టర్ అప్పగించారు.

ఏఎస్సై ఇంట్లో చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీరాంనగర్ రోడ్డు–14లో నివాసముంటున్న ఏఎస్ఐ రమేష్ ఇంట్లో చోరీ జరిగింది. ఆయన కుటుంబసభ్యులతో రెండు రోజుల క్రితం ఊరికి వెళ్లారు. గురువారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి చోరీ చేసినట్లుగా గుర్తించి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బీరువాలో దాచిన ఐదు తులాల బంగారం, కొంత నగదు చోరీ అయినట్లు అందిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.